సాక్షి నల్లగొండ

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



ప్రతీ గ్రామ చరిత్ర ఆన్‌లైన్‌లో..
ప్రతి గ్రామ చరిత్రను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్ అన్నారు. -8లో



ఐఐహెచ్‌టీ లేనట్టే..
పోచంపల్లిలో ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేయలేమని కేంద్ర జౌళిశాఖ మంత్రి దర్శన విక్రమ్ జర్దోశ్ తెలిపారు. -10లో

గరిష్టం/కనిష్టం 35°/17°

వాతావరణం
ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

11న జెడ్పీ సమావేశం

నల్లగొండ: ఈనెల 11న జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

లాభదాయక పంటలు సాగు చేయాలి



ఆయిల్ పామ్ సాగును పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ రూరల్: రైతులు లాభదాయకమైన పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ మండలం జీకే అన్నారంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న మహిళా రైతు శ్యామల వ్యవసాయ క్షేత్రాన్ని, కనగల్ మండలం చెర్ల గౌరారం గ్రామంలో విజయనాథ్‌రెడ్డి ఆయిల్ పామ్ సాగును పరిశీలించారు. సాగు వివరాలు, అనుసరించే పద్ధతులను రైతులు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ నియోజక వర్గ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు.

నిధులు కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణం నుంచి ముషంపల్లి, కన్నెకల్ మీదుగా ముకుందాపురం జాతీయ రహదారి వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, పాలడుగు నాగార్జున, హాషం కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిసి తదితరులు వినతి పత్రం అందజేశారు.

బంజారాల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న రాంచందర్‌నాయక్

నల్లగొండ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆలిండియా బంజారాసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. గురువారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాణావత్ బాబూరావ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడిగా అంగోతు ప్రవీణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శులుగా బిక్కునాయక్, రవినాయక్, శ్రీహరినాయక్, ఉపాధ్యక్షులుగా గోపాల్‌సింగ్, రవినాయక్, భాషానాయక్, శ్రీనునాయక్, రాజానాయక్, చంద్రమౌళి, మన్కీబాయి, న్యాయసలహాదారుడిగా బద్రునాయకర్, సహాయ కార్యదర్శిగా రమావత్ రవినాయక్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన జిల్లా కమిటీ సభ్యులను అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నాయక్, సైదానాయక్, నారాయణనాయక్, జగ్గునాయక్, బావోజీ, విజయ్‌కుమార్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.



లింగమంతుల స్వామిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న భక్తులు



పెద్దగట్టు ఆలయం నుంచి సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్‌కు మకరతోరణాన్ని తరలిస్తున్న వల్లపు, కోడి వంశస్తులు, యాదవులు తదితరులు

పెద్దగట్టు జాతర పరిసమాప్తం

ఐదు రోజుల పాటు ఓ లింగా.. నామస్మరణతో మార్మోగిన దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర గురువారం ముగిసింది. చివరి రోజు భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మకర తోరణాన్ని సూర్యాపేట పట్టణానికి తరలించడంతో జాతర పరిసమాప్తమైంది. – సూర్యాపేట, చివ్వెంల -8లో

రైతులకు ఊరట!

- తాజా బడ్జెట్‌లో రుణమాఫీకి అధిక నిధులు కేటాయించిన ప్రభుత్వం
- నాలుగేళ్ల నుంచి రూ.37 వేల లోపు రుణాలు మాఫీ
- ప్రస్తుతం రూ.90 వేల వరకు మాఫీ అయ్యే అవకాశం!



నల్లగొండ అగ్రికల్చర్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రుణమాఫీ కోసం రూ.6,380 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు కొంత వరకు మాఫీ కానుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 ఎన్నికల సమయంలో తాము రెండో సారి అధికారంలోకి వస్తే రూ.లక్షలోపు ఉన్న రైతు పంటరుణాలను వెంటనే మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అధికారంలోకి రాగానే 2018 డిసెంబర్ 31 వరకు రూ.లక్షలోపు రుణాలు కలిగిన రైతులకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్ల నుంచి తెప్పించుకుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని కమర్షియల్, ఇతర సహకార బ్యాంకులు కలిపి సుమారు రెండు లక్షల వరకు రైతులకు సంబంధించి రూ.269 కోట్ల వరకు పంటరుణాలు చెల్లించాల్సి ఉందంటూ జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. అయితే 2019 రాష్ట్ర బడ్జెట్‌తో పాటుగా మిగతా సంవత్సరాల బడ్జెట్‌లో కేటాయించిన రుణ మాఫీ నిధులు విడుదల చేసింది. ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రూ.37వేల లోపు పంటరుణాలు మాత్రమే మాఫీ చేయగా ఇప్పటి వరకు కేవలం రూ.150 కోట్ల వరకు మాత్రమే మాఫీ చేసినట్లు అనధికారిక గణాంకాలు చెబుతున్నారు. దీంతో రూ.లక్షలోపు రుణాలు ఉన్న రైతులు తమకు కూడా మాఫీ అవుతుందని నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ ప్రకటనతో రుణాలు చెల్లించని రైతులు

రాష్ట్ర ప్రభుత్వం 2018 ఎన్నికల ముందు రూ.లక్ష లోపు పంటరుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు రుణాలను బ్యాంకులకు చెల్లించలేదు. మొదటి దఫాలో విడుదల చేసిన నిధులు కేవలం రూ.25 వేల లోపు రుణాలను మాత్రమే మాఫీ చేశారు. తరువాత గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు కేవలం రూ.37 వేలలోపు మాత్రమే మాఫీ అయినట్లు బ్యాంకర్లతో పాటుగా వ్యవసాయ శాఖ అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. దీంతో గత నాలుగు సంవత్సరాలుగా రుణాలు చెల్లించని పంటరుణాలు వడ్డీతో సహా పెరిగిపోయి వడ్డీ అసలు కలిపి రుణాలు మూడింతలయ్యాయి. రైతులు కూడా పంటరుణాలు మాఫీ అవుతాయన్న ధీమాతో బ్యాంకులకు చెల్లించడంలేదు. పైగా చాలామంది రైతులు రుణాల రీషెడ్యూల్ కూడా చేయించుకోవడం లేదు. దీంతో ఆయా బ్యాంకులు రీ షెడ్యూల్ చేయించుకోని రైతులందరిని డిఫాల్టర్లుగా ప్రకటించి వారికి ఎలాంటి రుణాలను చెల్లించడం లేదు. అయితే తాజా బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో జిల్లాలో మార్చిలోపు ఎంత వరకు పంటరుణాలు మాఫీ కానున్నాయో స్పష్టంగా తెలియకపోయినప్పటికీ సుమారు రూ.90 వేల వరకు మాఫీ కావొచ్చని ఇటు.. వ్యవసాయ శాఖ, అటు.. లీడ్ బ్యాంకు అధికారులు అంచనా వేస్తున్నారు.

తాజా బడ్జెట్‌లో రూ.6,380 కోట్లు కేటాయింపు

వచ్చే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.6,380 కోట్లు నిధులు కేటాయించింది. దీంతో రైతుల్లో రుణమాఫీపై ఆశలు చిగిరించాయి. ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పంటరుణ గ్రహీతులకు కొత్త ఊరట కలిగినట్లు అయ్యింది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటించిన విధంగా వెంటనే నిధులు విడుదల చేసి రూ.లక్షలోపు పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని రైతులతో పాటుగా ఆయా రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నేను చేసిన అభివృద్ధే..

- బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ చేయలేదు
- నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి పోయేకాలం దగ్గర పడింది
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి

నల్లగొండ: నల్లగొండలో నేను చేసిన అభివృద్ధే కనిపిస్తుందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ చేయలేదని మాజీ మంత్రి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాదరి మారయ్య పుణ్యామని నల్లగొండ రోడ్లు బాగుపడుతున్నాయి. రూ.వంద కోట్లు తెచ్చి అక్కడక్కడా కుక్కల బొమ్మలు, గాడ్దుల బొమ్మలు పెట్టి అభివృద్ధి అంటున్నారు. పట్టణంలో రోడ్ల వెడల్పులో ఇళ్ల కూలగొట్టారు, రేపు పండ్ల బండ్లవాళ్లనీ అక్కడ ఉండనివ్వరు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి పోయేకాలం దగ్గర పడిందని అన్నారు. రూ.వంద కోట్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి పెట్టిన అది పూర్తి చేస్తే పాత బస్తీలో వాసన పోయేదని పేర్కొన్నారు. నల్లగొండ మీ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అంటున్నారని ఒక విలేకరి ప్రశ్నించగా అభివృద్ధి చేయలేదని అంటే ప్రజలు చెప్పుతో కొడతారన్నారు. ఆనాడు వైఎస్ సహకారంతో కేంద్రాన్ని ఒప్పించి రైల్వే ఫ్లెఓవర్ నిర్మించాను. దాని విలువ ఇప్పుడు రూ.270 కోట్లు, సారంగమార్గం, బ్రాహ్మణవెల్లంల, ఉదయసముద్రం ప్రాజెక్టు, పట్టణంలో రోడ్లు, మహాత్మాగాంధీ యునివర్సిటీ అన్నీ నేను మంజూరు చేయించినవేనని, అవి వారికి కనిపించడం లేదని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా బీబీనగర్ ఎయిమ్స్ కూడా అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. నకిరేకల్ నుంచి పానగల్ రోడ్డు విస్తరణ ఆనాడు ఇద్దరు ఎంపీలైన గుత్తా, బూర నర్సయ్య ఉండి ఏమి చేయలేదు.. నేను ఎంపీ అయిన తర్వాతే మంజూరు చేయించానన్నారు. నడి సెంటర్‌లో రూ.వంద కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమిలో బుద్ధి ఉన్న వాళ్లు ఎవరైనా బీఆర్‌ఎస్ పార్టీ భవనం కట్టుకుంటారా అని ప్రశ్నించారు. నేను ఎమ్మెల్యే అయిన తర్వాత అక్కడ దాన్ని తీసి వేసి ఆ స్థలంలో పేదలకు, జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, లేదా హాస్టళ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

కిషోర బాలికలకు శిక్షణ

నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం సాగ్ నాన్ న్యూట్రీషన్ పథకం కింద 14 నుంచి 18 సంవత్సరాల లోపు కిషోర బాలికలకు త్వరలోనే నల్లగొండలో టైలరింగ్, బ్యూటీషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మహిళా శిశు వికాస కేంద్ర జిల్లా మేనేజర్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్, ల్యాండ్‌లైన్ : 76600 22517, 08682 244416 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రమాద బీమాతో ఆర్థిక భరోసా

- తపాలా శాఖ జిల్లా అధికారి రఘునాథస్వామి



చెక్కును అందిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు

పెద్దవూర: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని తపాలా శాఖ జిల్లా అధికారి కె.రఘునాథస్వామి, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ) రాష్ట్ర చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్ అన్నారు. పోస్టాఫీసులో రూ.399లతో ప్రమాద బీమా పాలసీ తీసుకుని గత సెప్టెంబర్ నెలలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన మండలంలోని తుంగతుర్తికి చెందిన ఇస్రాం అంజమ్మ కుటుంబ సభ్యులకు రూ.10లక్షల చెక్కును అందించి మాట్లాడారు. రూ.399ల ప్రమాద బీమా పాలసీ తీసుకుని మృతి చెందిన బాధిత కుటుంబానికి రూ.10లక్షల చెక్కును అందించటం రాష్ట్రంలోనే ఇదే మొదటిదన్నారు. ఈ పథకం 2022 జూన్‌లో ప్రారంభమైందని, ఇప్పటి వరకు జిల్లాలో 14వేల మంది పాలసీ తీసుకున్నారని తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతి పోస్టాఫీస్‌ను కేంద్ర ప్రభుత్వం ఐపీపీబీగా మార్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ జిల్లా బ్రాంచ్ మేనేజర్ పి.ఫణిలక్ష్మీకాంత్, స్వాతి, దేవరకొండ సబ్ డివిజనల్ అధికారి ఏ.మదన్‌మోహన్, బీపీఎంలు మంద అశోక్, అనంతరామశర్మ, సర్పంచ్ మెండె విష్ణుప్రియాసైదులు, ఉప సర్పంచ్ గోపమ్మవెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలోపేతం దిశగా బీజేపీ

- బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా..
- మోదీ పథకాలను ప్రజలకు వివరించాలని నిర్ణయం
- నేటి నుంచి 25 వరకు శక్తికేంద్రాల సభలు



నల్లగొండ టూటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలు క్షేత్ర స్థాయిలో ఎండగట్టేందుకు తమ పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ శక్తి కేంద్రాల సభల పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని శక్తి కేంద్రాల పరిధిలో జనసందడి ఉండే ప్రధాన కూడళ్ల వద్ద శక్తి కేంద్రాల సభలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులంతా పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేసింది. శక్తి కేంద్రాల సభలు, సమావేశాలు జరిగే ప్రాంతాల్లో కనీసంగా 200 మంది ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 15 రోజుల కార్యక్రమానికి సంబంధించిన పూర్తి ప్రచార సమాచారాన్ని ఇప్పటికే జిల్లా పార్టీకి అందించింది.

ఇంటింటికీ కేంద్ర పథకాల కరపత్రాలు..

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, హామీలు ఇచ్చి నెరవేర్చని వాగ్దానాలు, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి కర పత్రాలను శక్తి కేంద్రాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ముందుగానే పంచి ప్రజలకు వివరిస్తారు. ప్రజలు, రైతుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన వివరించి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా శక్తి కేంద్రాల సభల ఉద్దేశమని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే శక్తి కేంద్రాల సభలను విస్తృతంగా ప్రసార సాధనాల ద్వారా ప్రచారం చేసుకోవాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం జిల్లా బాధ్యులకు ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. సభ నిర్వహణ తర్వాత స్థానిక సమస్యలు, ఎమ్మెల్యేల వైఫల్యాలపై పార్టీ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ పంచనున్నారు. మొదటి రోజు శక్తి సభలకు పార్టీ రాష్ట్ర నాయకులను పంపి శ్రేణుల్లో జోష్ నింపాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. నల్లగొండ అసెంబ్లీలో జరిగే సభకు గంగడి మనోహర్‌రెడ్డి, మిర్యాలగూడకు ప్రకాశ్‌రెడ్డి, నాగార్జునసాగర్‌కు గోలి మధుసూదన్‌రెడ్డి, మునుగోడుకు మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, నకిరేకల్‌కు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హాజరు కానున్నారు.

ఏ రోడ్డులో వెళ్లినా దుమ్మే..!



నల్లగొండ పట్టణంలోని రామగిరిలో రోడ్డుపై లేస్తున్న దుమ్ము



దుమ్ము లేవకుండా రోడ్డుపై పైపుతో నీళ్లు కొడుతున్న దుకాణదారు

- నీలగిరి పట్టణంలో యూజీడీ, రోడ్డు విస్తరణ పనుల కోసం తవ్వకాలు
- కంకర తేలి గుంతలమయంగా మారిన ప్రధాన రోడ్లు
- నాలుగు నెలలుగా పట్టించుకోని వైనం
- కనీసం నీళ్లు పోయకపోవడంతో దుమ్ము లేస్తున్న వైనం
- అవస్థల్లో దుకాణ, వాహనదారులు



మధ్యలో కంకర తేలి ఉన్న రోడ్డు

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణం మీదుగా వెళ్తున్న నకిరేకల్ – రేణికుంట జాతీయ రహదారి–565తోపాటు ప్రధాన రోడ్లు దుమ్మురేపుతున్నాయి. ప్రధానంగా హైవేను తవ్వి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పైప్‌లైన్ వేసి రోడ్డు నిర్మాణం చేపట్ట లేదు. దీంతో కంకర తేలిన రోడ్డపై వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము లేస్తోంది. అదే విధంగా ప్రధాన రోడ్లను సైతం విస్తరణ పేరుతో కంకర పోశారు. ఫలితంగా జనంతోపాటు రోడ్ల వెంట దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రోడ్లలో దుమ్ము లేచి దుకాణాల్లోకి వస్తుందని, రోజులో దాదాపు 10 గంటల పాటు తాము షాపుల్లో ఉండలేక నానా తిప్పలు పడుతున్నామని వివిధ దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలలుగా..

నల్లగొండలోని రామగిరి రోడ్డులో డ్రెయినేజీ పైప్‌లైన్ వేసిన కాంట్రాక్టర్ కంకర పోసి నాలుగు నెలలు అవుతుంది. వాహనాలు కంకర మీది నుంచి వెళ్తున్న సమయంలో దుమ్ము పెద్ద ఎత్తున లేస్తోందని, దీని కారణంగా అనేక మంది అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా పెద్ద గడియారం సెంటర్ నుంచి సావర్కర్ నగర్ ఫ్లైఓవర్ వరకు రోడ్డంతా గుంతలమయంగా, అస్తవ్యస్తంగా ఉండడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనాలు వెళ్తుంటే దుమ్ము లేవకుండా కనీసం నీళ్లు పోయించే నాథుడే లేకుండా పోయాడని వాహనదారులు, స్థానికంగా ఉన్న దుకాణాదారులు ఆరోపిస్తున్నారు. తవ్విన రోడ్డు వేయరు నీళ్లు పోయరని జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో అన్ని రోడ్ల పరిస్థితి ఇలాగే ఉన్నా ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కంకర రాళ్లు తగులుతూ గాయాలు..

అభివృద్ధి పనుల పేరుతో తవ్విన రోడ్లపై కంకరతో కూడిన చూర పోశారు. రోడ్లపై పోసిన కంకరపై వాహనాలు వెళ్లిన సమయంలో టైర్ల అంచున పడే రాళ్లు లేచి వచ్చి అటుగా వెళ్తున్న వ్యక్తులకు తగిలి గాయాల పాలవుతున్నారు. రామగిరి సెంటర్‌లో ఇటీవల ఓ వ్యక్తి తగిలి గాయాల పాలయ్యాడు. ఇలా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట వాహనదారులకు రాళ్లు తగులుతున్నాయి. ఒకవేళ కంకర రాయి గట్టిగా తాకి ప్రాణప్రాయ స్థితికి వస్తే దీనికి బాధ్యుడు ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రోడ్డు తవ్విన తరువాత రోడ్డు రోలర్‌తో తొక్కించి వెంటనే రోడ్డు వేసే అవకాశం ఉన్నా సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరగా రోడ్డు వేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

దుమ్ముతో నరకయాతన



రోడ్డు తవ్వడంతో చాలా అవస్థలు పడాల్సి వస్తుంది. రోజూ దుమ్ము, ధూళితో నరకయాతన అనుభవిస్తున్నాం. జాతీయ రహదారిపైనే ఇన్ని గుంతలు ఉంటే ఎవరికీ పట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

– దేవా, నల్లగొండ

ఆస్తమా లాంటి జబ్బులు వస్తాయి



దుమ్ము వల్ల ఆస్తమా, ఆయాసం, దగ్గు, జలుబు లాంటి వ్యాధులు వస్తాయి. ఇప్పటికే షుగర్, ఇతర వ్యాధులు ఉన్న వారికి దుమ్ముతో మరింత ప్రమాదం పొంచి ఉంది.

– డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు

బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి



నిడమనూరు : జోడోయాత్రను ప్రారంభిస్తున్న కుందూరు జానారెడ్డి

- సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి
- త్రిపురారం, నిడమనూరులో హాథ్ సే హాథ్ జోడోయాత్ర ప్రారంభం

త్రిపురారం, నిడమనూరు : రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా మాయమాటలు చెప్పుతూ డబ్బు మూటలతో గెలవాలని చూస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం త్రిపురారం, నిడమనూరు మండల కేంద్రాల్లో హాథ్ సే హాథ్ జోడోయాత్రలను ప్రారంభించారు. త్రిపురారం ఎంపీపీ అనుముల పాండమ్మ నివాసంలో, నిడమనూరులో జానారెడ్డి మట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. సకాలంలో రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడడం లేదా అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం త్రిపురాం మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, ఆయా మండలాల జెడ్పీటీసీలు ధనావత్ భారతి, నందికొండ రామేశ్వరి, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అంకతి సత్యం, నిడమనూరు ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాసరెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అంబటి సోమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, అనుముల వెంకట్‌రెడ్డి, కూరపాటి సైదులు, ధనావత్ వెంకట్రాం, పద్మ, బాలకృష్ణ, నాయిని సంతోష్, యడవెల్లి రంగసాయిరెడ్డి, మేరెడ్డి వెంకట్రామూల్, నర్సింగ్ విజయ్‌కుమార్, శివమారయ్య, లక్ష్మీనారాయణ, అశోక్, రమేష్, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, సైదిరెడ్డి, రవి పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన హుండీ ఆదాయం



హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చివ్వెంల (సూర్యాపేట): లింగమంతులస్వామి జాతరలో ఏర్పాటు చేసిన హుండీలను గురువారం అధికారులు లెక్కించారు. గత జాతరలో హుండీ ఆదాయం రూ.23.28లక్షలు రాగా, ఈసారి మొత్తం 28 హుండీల్లో రూ.25.71 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారుల వెల్లడించారు. అదేవిధంగా 550 గ్రాముల వెండి, రెండు గ్రాముల బంగారం వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఓ యువకుడు తాను ప్రేమించిన అమ్మాయితో జీవితాంతం కలిసి ఉండాలని రక్తంతో లేఖ రాసి హుండీలో వేశాడు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, తహసీల్దార్ రంగారావు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్, ఈఓ కుశలయ్య, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, డైరెక్టర్లు జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, కాసం శ్రీనివాస్, మట్టపల్లి శ్రీనివాస్, మొండికత్తి దుర్గమ్మ, మెంతబోయిన వెంకన్న, వార్డు కౌన్సిలర్ జాటోతు లక్ష్మి మకట్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

మకర తోరణం తరలింపులో తోపులాట

జాతర ముగింపు సందర్భంగా నిర్వహించిన మకర తోరణం తరలింపులో కోడి, వల్లపు వంశీయుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు గమనించి ఇరు వర్గాలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అదేవిధంగా గట్టుపై పీకలు ఊదుతూ ఆకతాయిలు ఘర్షణ పడడంతో కొంతమంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

లింగమయ్యా.. మళ్లొస్తామయ్యా



బోనం సమర్పించేందుకు వస్తున్న యువతి



పెద్దగట్టు వద్ద గొర్రె పొట్టేలుతో ఆలయ చైర్మన్, నాయకులు తదితరులు

- ముగిసిన పెద్దగట్టు జాతర
- చివరి రోజు వైభవంగా మకర తోరణం తరలింపు

సూర్యాపేట, చివ్వెంల: ఐదు రోజుల పాటు ఓ లింగా.. ఓ లింగా.. నామస్మరణతో మార్మోగిన పెద్దగట్టు జాతర గురువారం ముగిసింది. చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో కొలువైన శ్రీలింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణలోనే రెండో అతిపెద్దదైన ఈ జాతర ఈ నెల 5వ తేదీన సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి దేవరపెట్టె, సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి మకర తోరణాన్ని పెద్దగట్టుకు తీసుకురావడంతో ప్రారంభమైంది. జాతరలో అత్యంత ముఖ్య ఘట్టమైన సౌడమ్మ తల్లికి బోనాల చెల్లింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంగళవారం చంద్రపట్నం, బుధవారం నెలవారం కార్యక్రమాలను చేపట్టారు. గురువారం మకర తోరణాన్ని సూర్యాపేటకు తరలించడంతో జాతర ముగిసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా అధికారులు, ఆలయ పాలకవర్గం సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేశారు.

మకర తోరణం ప్రత్యేకత..

యాదవుల సంప్రదాయం ప్రకారం జాతర ప్రారంభానికి ముందు లింగమంతుల స్వామి అలంకరణ కోసం సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి కోడి, వల్లపు వంశస్తులు మకర తోరణాన్ని తెచ్చారు. ఈ తోరణాన్ని తిరిగి ఊరేగింపుగా సూర్యాపేటకు తరలించారు. అదేవిధంగా లింగమంతుల స్వామి గుడిపై ఉంచిన పసిడి కుండను దురాజ్‌పల్లి ఆవాసం ఖాసీంపేటకు చెందిన అలిశెట్టి వంశస్తులు జాతరకు ముందు తీసుకువచ్చి తిరిగి గురువారం తీసుకువెళ్లారు.

అన్ని శాఖల సమన్వయంతో..

జాతర విజయవంతం కావడంలో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేశాయి. పోలీసు శాఖ అత్యాధునిక సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణను విజయవంతంగా నిర్వహించింది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి ప్రజా రవాణాకు సమహకరించింది. వైద్యారోగ్యశాఖ ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించింది. పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ శాఖ, భక్తులకు తాగునీటికి ఇబ్బందులు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమన్వయంతో జాతర కవరేజీ నిర్వహించింది. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పర్యాటక ప్రదేశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నాయి. జాతరలో విజయవంతంగా పూర్తికావడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

సూర్యాపేట పట్టణంలోని కృష్ణా టాకీస్ ప్రాంతానికి చెందిన 4 సంవత్సరాల బాలుడు తల్లిదండ్రులతో కలిసి దురాజ్‌పల్లి జాతరకు వచ్చి తప్పిపోయి తిరుగుతుండగా తుమ్మలపెనపహాడ్ గ్రామానికి చెందిన కొరివి లింగయ్య గుర్తించి పోలీస్ కంట్రోల్ రూంలో అప్పగించాడు. పోలీసులు బాలుడి తల్లిదండ్రులను గుర్తించి వారికి బాలుడిని అప్పగించారు.



స్వామి వారికి మొక్కుతున్న భక్తులు



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ప్రతీ గ్రామ చరిత్రను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం

- తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



రైతులతో మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్

నడిగూడెం: తెలంగాణలోని ప్రతి గ్రామ చరిత్రను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో పాటు సాహిత్య అకాడమీలో గ్రంథాల రూపంలో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. మన ఊరు-మన చరిత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో కోదాడకు చెందిన కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సర్వేను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి రైతులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో పండిస్తున్న పంటల వివరాలు, పశుసంపద, గ్రామస్తుల స్థితిగతులు, జీవన విధానం, సాయుధ పోరాట యోధుల వివరాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 33మంది కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో విద్యార్థులతో గతేడాది నవంబరులో మన ఊరు-మన చరిత్ర కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు ఖమ్మంలో 700 గ్రామాలు, నల్గొండ ఎన్‌జీ కళాశాల విద్యార్థులు 250 గ్రామాలు, కోదాడ కేఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు 26 గ్రామాల చరిత్రను సేకరించడం పూర్తిచేశారని తెలిపారు. రాష్ట్రంలోని 12,769 గ్రామాల ప్రజలకు తమ ఊరి చరిత్రను తెలియజేయాలనే సంకల్పంతో సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీకోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నందిగామ నిర్మలకుమారి, తెర సాంస్కృతిక వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లు, రాంపల్లి సతీష్, గ్రామ పెద్దలు మొక్క భిక్షపతి, వట్టికూటి చలపతి, శెట్టి సతీష్, పసుపులేటి యాదగిరి, తాళ్లూరి రమేష్, వేదాంతం చక్రధరాచార్యులు ఉన్నారు.

రాజావారి కోటను సందర్శించిన గౌరీశంకర్

నడిగూడెం మండల కేంద్రంలోని రాజావారి కోటను గురువారం జూలూరి గౌరీశంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా కోటలోని పలు భవనాలు, గ్రంథాలయంలో గ్రంథాలను పరిశీలించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన అబ్దుల్ ఘని (38), పఠాన్ షరీఫ్ (40) కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట డాక్టర్ నందిగామ నిర్మల కుమారి, వేముల వెంకటేశ్వర్లు ఉన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతకు రెండు నెలల కాలపరివితితో అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్, ఆటోమొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్‌ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం, బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలని, ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత ఒరిజినల్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో ఈ నెల 20న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరుకావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.2వేల ఫీజుతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా స్టడీ మెటీరియల్‌కు రూ.350లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పించబడుతుందన్నారు. ఇతర వివరాలకు 9133908000, 933908111, 9133908222 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంజక్షన్ వికటించడంతో నడవలేని స్థితికి బాలుడు

- పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు



కుమారుడితో తల్లిదండ్రులు

కోదాడరూరల్: ఇంజక్షన్ వికటించడంతో బాలుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని మంగళితండాలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి తల్లిదండ్రులు ధరావత్ వెంకటేశ్వర్లు, పుష్ప తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న తమ కుమారుడు మోక్షిత్‌కు జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ పాషా వద్దకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అతను కాకుండా ఆయన తన కుమారుడితో బాలుడికి ఇంజక్షన్ వేయించారని ఆరోపించారు. అప్పటి నుంచే తన కుమారుడు నడవలేకపోతున్నాడని వాపోయారు. ఖమ్మం తీసుకెళ్లి వైద్యం చేయించినా ఎలాంటి మార్పులేదన్నారు. గురువారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు సూర్యాపేట ప్రభుత్వ వైద్యశాలకు లేక హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్యశాలకు తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారని తెలిపారు. తమ కుమారుడిని నడవలేని స్థితికి తీసుకొచ్చిన ఆర్ఎంపీ పాషా, అతని కుమారుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆర్ఎంపీ పాషాను వివరణ కోరగా ఇంజక్షన్ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఇంజక్షన్ వేసే సమయంలో బాలుడు కాలు కదిపి ఉండొచ్చని, ఆ సమయంలో ఏదైనా జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు.

సవరణ

చందంపేట జెడ్పీటీసీ రమావత్ పవిత్ర అనారోగ్య కారణాలతో కలెక్టర్‌కు రాజీనామా పత్రం అందజేయగా ఆయన ఆమోదించారు. కాగా గురువారం ప్రచురితమైన వార్తలో ఆమె అనర్హతకు సంబంధించిన కేసు తీర్పు రానున్న నేపథ్యంలో.. అని పొరపాటుగా వచ్చింది. దానిని కేసు విచారణలో ఉన్నట్లుగా పరిగణించగలరు.

హోండా షోరూంలో చోరీ

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని కోదాడ రోడ్డులో గల హోండా షోరూంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళం పగులగొట్టి షోరూంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హార్డ్‌డిస్క్, 2 సీసీకెమెరాలు, 2 వైఫై రూటర్లు అపహరించారు. షోరూం యజమాని సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అపహరించిన ఎడ్లను పట్టుకున్న రైతులు

- పరారైన దుండగులు

కొండమల్లేపల్లి: అపహరణకు గురైన ఎడ్లను రైతులు పట్టుకోగా.. వారిని చూసి దుండగులు పరారయ్యారు. ఈ సంఘటన మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు లాలయ్య బుధవారం తన వ్యవసాయ పొలంలో జోడెడ్లను కట్టేసి ఉంచాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన అతడు భోజనం చేసిన తర్వాత రాత్రి 11 గంటల సమయంలో మిరప తోటకు నీళ్లు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లి చూడగా ఎడ్లు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించాడు. ఈ విషయాన్ని గ్రామంలోని రైతులకు తెలియజేయడంతో పాటు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలోనే నాంపల్లి మండలం పగుడిపల్లి గ్రామ సమీపంలో రైతులు అపహరణకు గురైన ఎడ్లను గుర్తించారు. రైతులు రావడాన్ని పసిగట్టిన దుండగులు ఎడ్లను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఎడ్లను అపహరించేందుకు యత్నించిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు పోలీసులను కోరారు.

పాలు కాదు.. విషం!

రసాయనాలతో కృత్రిమ పాలు తయారీ

- శవాలను భద్రపరిచేందుకు వాడే ఫార్మాల్డిహైడ్ వినియోగం
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి
- రెండు నెలల్లో ఆరు ఘటనలు
- ఈజీ మనీ కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం



బీబీనగర్ మండలం కొండమడుగులో కల్తీ పాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: సంపాదనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ప్రమాదకర రసాయనాలతో కృత్రిమ పాలు తయారు చేస్తూ వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో పాల పౌడర్, యూరియా, నూనె కలిపి పాలు తయారు చేయడం చూశాం. కానీ, బీబీనగర్ మండలం కొండమడుగలో ఓ వ్యాపారి మనుషుల శవాలను భద్రపరిచేందుకు వాడే ప్రాణాంతక ఫార్మాల్డిహైడ్‌ను కలుపుతున్నట్లు ఫుడ్ సెక్యూరిటీ అధికారులు గుర్తించారు. గడిచిన రెండు నెలల్లో ఐదు చోట్ల కల్తీ పాలు పట్టుబడ్డాయి. తాజాగా గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో కల్తీ పాల తయారీ గుట్టు రట్టయ్యింది.

రాజధానికి సమీప మండల్లాలో ఎక్కువ

పాల దిగబడి తగ్గి, మరోవైపు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు కల్తీ పాల తయారీకి మొగ్గు చూపుతున్నారు. లాభాల అత్యాశతో స్వచ్ఛమైన పాలను కల్తీ చేస్తున్నారు. ముఖ్యంగా కల్తీ పాల దందా హైదరాబాద్‌కు చేరువలో ఉన్న హెచ్ఎండీఏ మండలాలైన భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, బొమ్మలరామారంలో జోరుగా సాగుతోంది. వ్యాపారులు తెల్లవారుజామునే నగరానికి పాలు రవాణా చేస్తుండటంతో అధికారుల నిఘా కొరవడింది. ఇది కాస్తా అక్రమార్కులకు కలిసొస్తుంది.

లీటరు పాలు మూడింతలు

వ్యాపారులు గ్రామాల్లో రైతుల నుంచి గేదె పాలను లీటరు రూ.40ల నుంచి రూ.45కు కొనుగోలు చేస్తున్నారు. వీటిలో నీళ్లు, పాల పౌడర్, ఇతర రసాయనాలను కలిపి మూడింతలు చేస్తున్నారు. ఈ పాలను ఆటోలు, ట్రాలీలు, ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్‌లోని హోటళ్లు, స్వీటు షాపులు, గృహాలకు సరఫరా చేస్తూ లీటరు రూ.60 నుంచి రూ.80లకు విక్రయిస్తున్నారు. అయితే కల్తీని గుర్తించని ప్రజలు.. గ్రామాల నుంచి వచ్చే పాలు స్వచ్ఛమైనవని భావించి కొనుగోలు చేస్తున్నారు.

దుష్పరిమాణాలు

హైడ్రోజన్ పెరాక్సైడ్, ఫార్మాల్డిహైడ్, సుక్రోజ్, నూనె, యూరియా, సర్ఫ్, బేకింగ్ సోడా, యూరియా, పాలపొడి లాంటి రసాయన పదార్థాలను వినియోగించి కృత్రిమ పాలు తయారు చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెలుగుచూసింది. అయితే కల్తీ పాలను దీర్ఘకాలంగా తాగడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

నమోదైన కేసులు

- ఈ నెల 9వ తేదీన భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాలలో 200 లీటర్ల కల్తీ పాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి 31న భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్, బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో 400 లీటర్ల కల్తీ పాలు పట్టుబడ్డాయి.
- జనవరిలో బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యాపారి తన పాల సెంటర్‌లో పాలు విరిగిపోకుండా, ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు ఫార్మాల్డిహైడ్ రసాయనాన్ని వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు.
- జనవరిలో భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్‌లో కల్తీ పాలు పట్టుబడ్డాయి.
- జనవరిలో చౌటుప్పల్ మండలం అల్లాపురంలో 160 లీటర్ల కల్తీ పాలను పోలీసులు పట్టుకున్నారు.
- మూడు నెలల క్రితం బొమ్మలరామారం మండలం చౌదరిపల్లిలో పోలీసులు కల్తీపాల గుట్టు రట్టు చేశారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

కల్తీ పాలను తాగడం వల్ల ముఖ్యంగా జీర్ణక్రియ, కండరాలు, నాడీ వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కల్తీ పాలలో వినియోగించే రసాయనాలు స్లో పాయిజన్‌గా మారి శారీరక, మానసిక సమస్యలు ఏర్పడుతాయి. జ్ఞాపక శక్తి మందగిస్తుంది.రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధుల్లో ఈ ప్రభావం అధికంగా ఉంటుంది.

– డా. యాదగిరి, భూదాన్‌పోచంపల్లి

తనిఖీలు ముమ్మరం

కల్తీ పాలను తయారు చేసి విక్రయించడం నేరం. గ్రామాల్లో కల్తీ పాలను తయారు చేసే వారిని గుర్తించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నాం. అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ పెట్టుతాం. పాలు, ఇతర ఆహారపదార్థాలు కల్తీ చేస్తున్నట్లు తెలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– జ్యోతిర్మయి, జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

పాలల్లో రసాయనాలు

- కల్తీ పాలు తయారీదారుడిపై కేసు

భూదాన్‌పోచంపల్లి: కల్తీ పాలు తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన పాల వ్యాపారి పట్నం ప్రభాకర్ కల్తీ పాలను తయారు చేసి సొంత వాహనంలో హైదరాబాద్‌లోని హోటళ్లు, వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. కల్తీ పాలు తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం పోలీసులు ప్రభాకర్ ఇంటిపై దాడి చేసి 200 లీటర్ల కల్తీపాలతో పాటు, పాలలో వినియోగించే ఒక లీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్ బాటిల్, ఒక పాల ప్యాకెట్, ఐదు అల్యూమినియం పాల క్యాన్‌లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.



కల్తీ పాల క్యాన్లతో నిందితుడు ప్రభాకర్

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

నేరేడుచర్ల: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన గురువారం సాయంత్రం నేరేడుచర్ల పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకట్రామా థియేటర్ సమీపంలో నివసిస్తున్న రేపాల జనార్దన్, ఆయన సతీమణి ఊర్మిల స్వీట్లు తయారు చేసి దుకాణాలకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో దురాజ్‌పల్లి లింగమంతుల జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి వారు స్వీట్లు అందజేయగా, అందుకు సంబంధించిన డబ్బులు వసూలు చేసేందుకు గురువారం ఉదయం భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపు పగులగొట్టి, ఇంట్లోని బీరువా కిందపడి ఉండటంతో పాటు భార్యాభర్తలు ఇద్దరూ ఆందోళనకు గురయ్యారు. బీరువాలో దాచుకున్న రూ.25వేల నగదు, రెండు చంప సగరాలు, రెండు చెవుల దిద్దులు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు, బంగారు ఉంగరం చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నాగార్జునసాగర్: బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను కారు ఢీకొట్టడంతో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన నాగార్జునసాగర్-హాలియా ప్రధాన రహదారి వెంట ఉన్న నాట్కో ఫార్మా రెసిడెన్సీ క్వార్టర్ల ముందు గురువారం చోటుచేసుకుంది. నాగార్జునసాగర్ ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన మైలంపల్లి మల్లికార్జున్, మైలంపల్లి కాంచన (24) భార్యభర్తలు. మత్స్యకారులైన వీరు చేపలు పట్టేందుకు రాత్రి సాగర్ జలాశయంలో వేసిన వలలు తీసేందుకు రోజు మాదిరిగానే గురువారం ఉదయాన్నే బైక్‌పై జలాశయ తీరానికి బయల్దేరారు. ఈ క్రమంలో నాగార్జునసాగర్-హాలియా ప్రధాన రహదారి వెంట ఉన్న నాట్కో ఫార్మా రెసిడెన్సీ క్వార్టర్ల ముందు చేరుకోగానే హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కారంపూడికి వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాంచన మృతిచెందగా, మల్లికార్జున్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం కాంచన మృతదేహాన్ని స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మల్లికార్జున్‌ను మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

నార్కట్‌పల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని రాంనగర్ కాలనీ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడెం సమీపంలోని రామ్‌నగర్ కాలనీ వద్ద నార్కట్‌పల్లి నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి(35)ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు నీలి రంగు జీన్స్, క్రీమ్ రంగు చొక్కా ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు 94407 95636, 94407 95610 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

భువనగిరి: కాల్వ తవ్వేందుకు వెళ్లిన కూలీ మృతికి కాంట్రాక్టర్, సైట్ ఇంజనీర్ కారణమని వారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గురువారం భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. మండలంలోని బస్వాపురం గ్రామంలో 2018లో కాల్వ తవ్వుతుండగా అక్కడే కూలీ పనిచేస్తున్న మహేష్ కాల్వలో పడి మృతిచెందాడు. కాంట్రాక్టర్, సైట్ ఇంజనీర్ సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మహేష్ మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ భిక్షపతి కేసు నమోదు చేశారు. గురువారం భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు ఈ కేసును విచారించి.. మహేష్ మృతికి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన సైట్ ఇంజనీర్ ఏడుకొండల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ శ్రీరామ్ కారణమని గుర్తించి వారికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

- సాగర్‌లో విషాదం



వాచస్పతి (ఫైల్)



నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన శివాలయం పుష్కర ఘాట్ వద్ద డీఎస్పీ వెంకటగిరి తదితరులు







నాగార్జునసాగర్ వద్ద కృష్ణానదిలో మునిగి మృతిచెందిన వాచస్పతి, నాగరాజు, చంద్రకాంత్